

అన్నదానానికి రూ.లక్ష విరాళం


సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదానానికి వైటీపీఎస్ ప్రసాద్ (కాకినాడ) తన కుమారుడు యాళ్ల వెంకటసత్య సాయి నవీన్ పేరున రూ.లక్ష విరాళం ఇచ్చారు.



రానున్నది డ్రోన్ యుగం

ప్రస్తుత సాంకేతిక యుగంలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగం పెరిగిందని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన రావు పేర్కొన్నారు. 8లో▸

డెల్టా కాలువలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

28 వరకు క్రీడాకారుల రిజిస్ట్రేషన్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ అబెల్డ్ క్రికెట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు నూతన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 28వ తేదీతో ముగుస్తుందని ఏసీఏ డిఫరెంట్లీ అబెల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లవల్లి సూర్యనారాయణ సోమవారం ప్రకటించారు. దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), గౌరవ కార్యదర్శి సానా సతీష్‌బాబు ఆదేశాల మేరకు ఇచ్చిన రిజిస్ట్రేషన్ గడువు 2024 డిసెంబర్ 28వ తేదీ ముగుస్తుందన్నారు. 30వ తేదీన రిజిస్ట్రేషన్ చేసుకున్న దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ తేదీని ప్రకటిస్తామన్నారు. వివరాలకు 92994 01222, 63031 39365 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హెల్త్ అసిస్టెంట్ల తొలగింపుపై సీఎంతో మాట్లాడతా..



ఎంపీ పురందేశ్వరికి విన్నవిస్తున్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలోని హెల్త్ అసిస్టెంట్ల ఉద్యోగులను తొలగించిన విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడతానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో ఇటీవల ఉద్యోగాల నుంచి తొలగింపునకు గురైన హెల్త్ అసిస్టెంట్ల విషయాన్ని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు తీర్పు సాకుతో ఉద్యోగాలు తొలగింపుతో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన బాధలో నాలుగు రోజుల వ్యవధిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకుని వచ్చారు. 22 ఏళ్ల పాటు ఉద్యోగం చేసి రోడ్డున పడితే కుటుంబాలు ఎలా బతకాలని వాపోయారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని పురందేశ్వరి హామీ ఇచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పాలియాటివ్ కేర్ ప్రోగ్రాంలో పనిచేసేందుకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు చేస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఈ విషయాన్ని ప్రకటనలో తెలిపారు. ఒక జనరల్ ఫిజీషియన్, ముగ్గురు స్టాఫ్ నర్సులను నియమించనున్నామన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 26 నుంచి జనవరి 4వ తేదీ వరకూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు బొమ్మూరు కేశవరం రోడ్డులోని మహిళా ప్రాంగణంలోఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.



విద్యుత్ కాంతులతో రాజమహేంద్రవరం లూథర్‌గిరిలోని లూథరన్ చర్చి



విద్యుత్ దీపాల అలంకరణలో గౌరీపట్నం క్రీస్తు ఆలయం

హృదయ నివేదనే క్రిస్మస్

- శాంతి మార్గం.. క్రీస్తు సందేశం
- జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు
- పలు ప్రాంతాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

నిడదవోలు : శాంతికి, త్యాగానికి ప్రతీక క్రిస్మస్..లోకానికి పర్వదినంగా క్రీస్తు జననాన్ని అభివర్ణిస్తారు. విశ్వాసం, ప్రేమ, కరుణ, దయ, నిరీక్షణ సందేశంతో క్రీస్తు లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. మన హృదయాలను క్రీస్తుకు సమర్పించడమే నిజమైన క్రిస్మస్. ఈ పండగకు జిల్లాలోని చర్చిలు, క్రైస్తవ గృహాలు ముస్తాబయ్యాయి. పలు ప్రాంతాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. బుధవారం క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక కథనం..

క్రైస్తవ లోకం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో కలసి సంతోషంగా ఆచరించే పర్వదినమే క్రిస్మస్..క్రిస్మస్ అనగా క్రీస్తు జన్మదినం. క్రైస్ట్ అంటే



నిడదవోలు కృపాధార లూథరన్ చర్చిలో క్రీస్తు జననం గుర్తుగా అలంకరించిన పశువుల పాక సెట్టింగ్

అభిషిక్తుడు. మాస్ అంటే ఆరాధన అని అర్థం. ఈ పదానికి అర్థం క్రీస్తును ఆరాధించుట.. చరిత్రను పరిశీలిస్తే...సృష్టికర్త అయిన యెహోవా దేవుడు తన ప్రియ కుమారుని నరరూపిగా ఈ భువికి కానుకగా ఇచ్చిన పవిత్ర దినమే క్రిస్మస్. పాత నిబంధన కాలంలోని యోషయా, దానియేలు, మీకా, మలాకీ తదితర ప్రవక్తల ప్రవచనాల నెరవేర్పే ఈ క్రిస్మస్. ఈయన పరిశుద్ధాత్మ వలన పవిత్రుడిగా కన్య గర్భాన జన్మించాలన్నది యెహోవా దేవుని నిర్ణయం. **ఈ సంకల్పమే దైవ దూత గాబ్రియేలు ద్వారా మరియాకు అందించిన శుభవర్తమానం. రాజాధిరాజు ప్రభువుల ప్రభువు తనను తాను తగ్గించుకుని పాలస్తీనా దేశంలో బెత్లెహేము అనే గ్రామంలో పశువుల పాకలో జన్మించారు.** క్రీస్తు జన్మించగానే ఆకాశంలో ఆయన నక్షత్రం వెలసింది. ఈ నక్షత్ర జాడతో తూర్పుదేశపు జ్ఞానులు క్రీస్తు జననాన్ని గుర్తించారు. దైవ దూత ద్వారా అమాయకులైన గొల్లలకు ఈ వర్తమానం అందింది. ఆ సమయంలో పరలోక సైన్య సమూహం స్తుతి గానాలు చేసింది. నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించు అన్నదే క్రీస్తు బోధనల సారాంశం. దాని ప్రకారం క్రైస్తవులు నూతన వస్త్రాలు, కానుకలు, ఆహార పదార్థాలు ఇచ్చి దీనులను ఆదరిస్తారు. చర్చిలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. అందరూ కలసి ఐక్యతతో దేవుని ఆరాధిస్తారు.

శాంటాక్లాజ్ (క్రిస్మస్ తాత)

సెయింట్ నికొలస్ అనే గ్రీకు బిషప్ స్ఫూర్తితో శాంటాక్లాజ్ అనే ఒక పాత్ర రూపుదిద్దుకుంది. 1823 సంవత్సరంలో అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లో శాంటా క్లాజ్



వర్ణనపై రచించిన ఏ విజిట్ ఫర్ సెయింట్ నికొలస్ అనే కవిత ఆధారంగా థామస్ నేస్ట్ అనే రాజకీయ, వ్యంగ్య చిత్రకారుడు శాంటాక్లాజ్ ఊహాచిత్రం గీశారు. దీని ఆధారంగా క్రిస్మస్‌తాత పాత్ర రూపుదిద్దుకుంది. శాంతాక్లాజ్ చిత్రాన్ని కోకోకోలా కంపెనీ తమ ఉత్పత్తుల ప్రచార సాధనంగా వినియోగించుకున్న తరుణంలో శాంతాక్లాజ్ ఎరుపు, తెలుపు రంగుల వస్త్రధారణతోనే నేటికీ అందరినీ అలరిస్తున్నాడు. క్రిస్మస్ రోజున దుప్పులు నడిపే రథంపై క్రిస్మస్ తాత వస్తాడని, మంచి ప్రవర్తన గల పిల్లలకు బహుమతులు తెస్తాడని చెబుతుంటారు.

క్రిస్మస్ ట్రీ



క్రిస్మస్ వేడుకల్లో చర్చిలలో క్రిస్మస్ ట్రీని అలంకరించడం ఒక వాడుక. ప్రపంచ దేశాల్లో ఒక్కో దేశంలోను క్రిస్మస్ ట్రీకి సంబంధించి పలు రకాల చరిత్ర ఉంది. ఆధునిక జర్మనీ ఏర్పడిన తరువాత ఈ ట్రీ ప్రాచుర్యంలోకి వచ్చింది. 16వ శతాబ్దంలో మార్టిన్ లూథర్ మొదటిసారిగా ఎవర్‌గ్రీన్ అనే చెట్టును కొవ్వొత్తులతో అలంకరించినట్టు చెబుతారు. ట్రీ వర్షిప్ అనేది యూరోపియన్లలో అతి సాధారణం. నిత్య జీవానికి సంకేతంగా క్రిస్మస్ ట్రీని అలంకరిస్తారు. ఈజిప్షులు, చైనీయులు, హీబ్రూస్ ట్రీని అలంకరించేవారు. ఈ సంప్రదాయం 20వ శతాబ్దంలో చర్చిలకు విస్తరించింది. కాలక్రమేణా ఈ సంప్రదాయం అన్ని దేశాలకు విస్తరించింది. 1982లో వాటికన్ సిటీలో ఉన్న కేథలిక్ చర్చిలకు కూడా విస్తరించింది. క్రిస్మస్ ట్రీ నిత్య జీవానికి సూచికగా అపవాదును పారదోలే సాధనంగా భావిస్తూ క్రైస్తవులు క్రిస్మస్ దినాల్లో గృహాలు, చర్చిల్లో ట్రీలను అలంకరిస్తారు.

కేరల్స్‌తో సందడి

ఏసు క్రీస్తు జన్మ శుభ వర్తమానాన్ని ప్రకటిస్తూ ఆయా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలకు ముందు సంఘ కాపరితో పాటు యువజనులు రాత్రి వేళలో ఇంటింటికీ తిరిగి కేరల్స్ నిర్వహిస్తారు. క్రీస్తు స్తుతి గీతాలతో, సంగీత వాయిద్యాలతో క్రీస్తు నేడు పుట్టెను హల్లెలూయా నినాదాలు చేసుకుంటూ క్రైస్తవ గృహాలను సందర్శిస్తారు.

క్రిస్మస్ సందేశం



సమాజంలో బాధ నుంచి భక్తిని, బాధ్యతను నేర్పించి, ప్రపంచ శాంతిని, సౌభాగ్యాన్ని అనుగ్రహించే రోజు క్రిస్మస్. క్రైస్తవ విశ్వాసులు దేవునిపై పరిపూర్ణ భయ భక్తులతో ఆయనకు ఇష్టులుగా జీవించి, శాంతి సమాధానాలు పొందడమే నిజమైన క్రిస్మస్ ఆరాధన.

– రెవరెండ్ పాస్టర్ బయ్యే ఆనంద్‌కుమార్, కృపాధార లూథరన్ చర్చి, నిడదవోలు

సర్వమానవాళికి పర్వదినం



క్రిస్మస్ సర్వమానవాళికి పర్వదినం. ఈ పండగ ఆర్భాటం కాదు క్రైస్తవ విశ్వాసం. సాక్ష్యం, ప్రేమ, ఐక్యత, ప్రార్థనా శక్తిని వృద్ధి చేసే మంచి తరుణం. క్రిస్మస్ ఆరాధన అంటే క్రీస్తు మాదిరి నడుచుకోవడం, క్రీస్తు మాదిరి జీవించడం.

– పి.శ్యామ్‌పాల్, బిషప్ రెవరెండ్ పాస్టర్, నిడదవోలు

క్రిస్మస్ సర్వమానవాళికి పర్వదినం



ఏసుప్రభు జననంలో ఆయన చూపిన విధేయత, తగ్గింపు స్వభావం, కర్తవ్య నిర్వహణ, ప్రేమ మన జీవితంలో అలవరుచుకుని అవలంబించడమే నిజమైన క్రిస్మస్. క్రిస్మస్ సర్వమానవాళికి పర్వదినం. సమస్త మానవుల నిత్య జీవ ప్రాప్తికి మంచి మార్గం. క్రీస్తు జన్మం నిజమైన క్రైస్తవత్వం, ప్రేమతత్వాన్ని ప్రబోధించింది.

– మెంటే దయరాజగిరి, చైర్‌పర్సన్, మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చి, నిడదవోలు)

పూర్ణ హృదయంతో ఆరాధించాలి



క్రీస్తు పుట్టుకలో దేవదూతలు, జ్ఞానులు, గొర్రెల కాపరులు ఆయనను ఆరాధించారు. జ్ఞానులైన వారు తాము తీసుకువచ్చిన బంగారం, సాంబ్రాణి, బోళమును, బహుమానాలను బాలుడైన క్రీస్తుకి సమర్పించారు. పరలోకం విడిచి భూలోకమునకు వచ్చిన క్రీస్తును పూర్ణ హృదయంతో ఆరాధించాలి. మన హృదయాలను క్రీస్తుకు సమర్పించడమే నిజమైన క్రిస్మస్.

– కోరుమిల్లి కమలాకర్, రెవరండ్ పాస్టర్, రాజమహేంద్రవరం

అర్జీల నమోదులో సిబ్బంది కీలకం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను స్వీకరించి, వారికి ప్రత్యేక ఐడీతో కూడిన సంఖ్యను కేటాయించడంలో సిబ్బంది కీలకంగా వ్యవహరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం గ్రీవెన్స్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు ప్రజల తమ సమస్యలను విన్నవించేందుకు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి వస్తారన్నారు. ఇప్పటి వరకు వివిధ శాఖలకు సంబంధించి 172 అర్జీలు స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి స్వయంగా దివ్యాంగుల వద్దకు వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు.



దివ్యాంగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్‌కు 26 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం'(పీజీఆర్ఎస్)కు 26 ఫిర్యాదులు వచ్చినట్టు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం. మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ పీజీఆర్ఎస్‌ను నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వివిధ రకాల అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల ఫిర్యాదులను పరిశీలించి, వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసిందిగా ఉత్తర్వులు ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు 26 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి.

ఇసుక దళారీలపై కేసులు

ఎస్పీ సూచన

పెరవలి: జిల్లాలో ఇసుక రీచ్‌ల వద్ద అధిక ధరలకు ఇసుక అమ్మితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా పెరవలి పోలీస్ స్టేషన్‌కు సోమవారం వచ్చిన ఆయన రికార్డులు పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద దళారీలు అధిక మొత్తంలో సొమ్ము వసూలు చేస్తే బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించామన్నారు. ర్యాంప్‌ల వద్ద దళారీలు ఉంటే ఉపేక్షించవద్దని వారిపై చర్యలు తీసుకోవాలని నిడదవోలు సీఐ, పెరవలి ఎస్సైలను ఆదేశించారు. జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, రాత్రి గస్తీలో భాగంగా ఏడు టీమ్‌లు ఏర్పాటు చేశామని, గంజాయి నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని



పెరవలి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

తెలిపారు. కొవ్వూరు డివిజన్‌లో పోక్సో కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని వీటి నివారణకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. పెరవలి పరిధిలో గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించేవని అవి తగ్గిపోయి నల్లజర్ల పరిధిలో ఎక్కువగా జరుగుతున్నాయని వాటి నివారణకు చర్యలు చేపట్టామని తెలిపారు. విదేశాలకు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల ద్వారా వెళ్లినవారు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ పాల్గొన్నారు.

దోపిడీ ఉచితం!

- డీఎస్ పాలెంలో అనధికార ర్యాంపు
- వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలింపు
- పట్టించుకోని అధికారులు
- అక్విడెక్టు సమీపంలో సైతం తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



పి.గన్నవరం శివారు డీఎస్ పాలెం వద్ద ఏర్పాటు చేసిన అనధికార ఇసుక ర్యాంపు

పి.గన్నవరం: ఇసుక ఉచితం పేరుతో కూటమి నేతలు భారీగా దోచుకుంటున్నారు. నదీపాయలోకి అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేసి ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు. భారీ ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పి.గన్నవరం శివారు డీఎస్ పాలెం సమీపంలో కూటమి నేతలు అనధికార ఇసుక ర్యాంపును నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తూరలు ఏర్పాటు చేసి, నదిలోకి బాట ఏర్పాటు చేశారు. పది రోజుల నుంచి రోజూ వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. పి.గన్నవరం మండలం సీఆర్‌జెడ్ పరిధిలో ఉండడంతో ఇసుక తీయడానికి అనుమతులు లేవు. నియోజకవర్గ నేత ఆదేశాలతో ర్యాంపు నిర్వహిస్తున్నారని, అందుకే అధికారులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శిస్తున్నారు. రోజుకు సుమారు 400 ట్రాక్టర్ల ఇసుకను బయటకు తరలిస్తున్నారు. ఈ అనధికార ర్యాంపులో ట్రాక్టర్ ఇసుకను రూ.700కు లోడు చేస్తున్నారు. లోడు చేసే జట్టు కార్మికులకు రూ.350 చెల్లిస్తున్నారు. మిగిలిన రూ.350 బాటల నిర్వాహణ, ర్యాంపునకు వెళ్లే దారిలో రైతులకు ఇవ్వాలని వసూలు చేస్తున్నారు.

వివాదంతో విరామం..

స్థానిక అక్విడెక్టు దిగువన అనధికారికంగా బోట్సుమెన్ సొసైటీ ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపు నడిచేది. నిబంధనలకు విరుద్ధంగా పడవలపై ఇసుకను తీసి విక్రయించేవారు. అయితే డీఎస్ పాలెం వద్ద ఓపెన్ ర్యాంపు ఏర్పాటు చేయడంతో అక్విడెక్టు దిగువన ఇసుక విక్రయాలు తగ్గిపోయాయి. దీంతో డీఎస్ పాలెం ఓపెన్ ర్యాంపులో కూటమి నేతలతో పాటు బోట్సుమెన్ సొసైటీ కూడా వాటాదారుగా ఉన్నట్టు చెబుతున్నారు. అయితే ర్యాంపులోకి వెళ్లే ట్రాక్టర్ల వద్ద రూ.700 వసూలు చేసి ఇక స్లిప్ ఇస్తారు. దానిని కూలీలకు ఇస్తేనే ఇసుక లోడు చేస్తారు. కాగా ఆ స్లిప్పులపై డీఎస్ పాలెం ర్యాంపు అని ముద్రించడాన్ని బోట్సుమెన్ సొసైటీ సభ్యులు అభ్యంతరం చెప్పారు. బోట్సుమెన్ ర్యాంపుగా స్లిప్పులపై ముద్రించాలని పట్టుపట్టడంతో కొంతసేపు ర్యాంపు ఆగిపోయింది.

కలెక్టర్‌కు జనసేన ఎంపీటీసీ ఫిర్యాదు

పి.గన్నవరం మండలంలో అక్రమంగా మట్టి, ఇసుక తవ్వకాలు సాగిస్తున్న వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, సుమోటో కేసుగా స్వీకరించాలని కోరుతూ జనసేన పార్టీకి చెందిన ఊడిమూడి–2 ఎంపీటీసీ సభ్యుడు ఆదిమూలం సూర్యనారాయణమూర్తి సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా స్పందనలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఉప ముఖ్యమంత్రికి వినతి పంపినట్టు తెలిపారు.

విత్తు లేక నత్తనడక

- బొండాలు రకం విత్తనాలకు తీవ్ర కొరత
- ఆ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ససేమిరా
- డెల్టాల్లో 4.30 లక్షల ఎకరాల్లో సాగు
- ఇటీవల ఆ తీరంలో తగ్గిపోతున్న దిగుబడి
- గతంలో ఎంటీయూ- 3626కు డిమాండ్
- ఈసారి ప్రైవేట్ రకంలో తగ్గిన మొలక శాతం

సాక్షి, అమలాపురం: డెల్టా రైతుల ఆశల సాగు రబీకి అడుగడుగునా అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు విత్తన కొరత తోడయ్యింది. అధిక దిగుబడులందించే 'బొండాల' రకాల విత్తనాలు రైతులకు మార్కెట్‌లో దొరకడం లేదు. ఇది రబీసాగు నత్తనడకకు కారణమవుతోంది.

డెల్టాలో రబీలో పెద్ద ఎత్తున సాగు చేసే బొండాల రకాల విత్తనాలకు కొరత ఏర్పడింది. ప్రభుత్వం రబీలో బొండాల రకం సాగు వద్దంటున్నా రైతులు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలో ఉన్న తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలలో సుమారు 4.3 లక్షల ఎకరాల్లో రబీ వరిసాగు జరుగుతోందని అంచనా. కోనసీమ, కాకినాడ జిల్లాలతో పోలిస్తే తూర్పు గోదావరి జిల్లాలో అనపర్తి వ్యవసాయ సబ్ డివిజన్‌లో మినహా మిగిలిన ప్రాంతాల్లో బొండాల కన్నా ఆర్ఎస్ఆర్ హై క్వాలిటీని అధికంగా సాగు చేస్తారు. కోనసీమ జిల్లా పరిధిలో తూర్పు డెల్టాలో



ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో వర్షాల వల్ల దెబ్బతిన్న విత్తనాలు చల్లిన నారుమడి

ఆలమూరు, రామచంద్రపురాల్లో అధికంగాను, మధ్య డెల్టా పరిధిలో కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో 50 శాతం ఈ రకం సాగు చేస్తారు. గతంలో మధ్య డెల్టాలో చాలా తక్కువగా బొండాలు సాగు చేసేవారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కన్నా బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు బొండాల ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు సైతం పెద్ద ఎత్తున ఈ రకం సాగుకు మొగ్గు చూపుతున్నారు. కాకినాడ జిల్లాలో కాజులూరు, కరప వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో బొండాలు సాగు అధికం. ఇక్కడ ప్రాంతాన్ని బట్టి 70 శాతం నుంచి 80 శాతం వరకు ఈ రకాన్ని సాగు చేస్తారు.

గతంలో ఎంటీయూ – 3626 రకాన్ని అధికంగా సాగు చేసేవారు. గత రెండు, మూడు దఫాలుగా ఈ రాకానికి తెగుళ్లు, పురుగులు అధికంగా వస్తున్నాయి. సగటు దిగుబడి 55 బస్తాల నుంచి 45



ఎంటీయూ-3626 బొండాల రకం విత్తనాలు

బస్తాలకు తగ్గింది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ రకాల బొండాలను సాగు చేస్తున్నారు. దీంతోపాటు ఒక ప్రముఖ ప్రైవేట్ కంపెనీకి చెందిన బొండాల రకం విత్తనాల లభ్యత ఉన్నా రైతులు దానికి దూరంగా ఉంటున్నారు. ఈ రకం సగటు దిగుబడి 55 బస్తాలకు పైగా ఉన్నప్పటికీ ఈ ఏడాది మొలక శాతం 60 శాతం మించడం లేదని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల మరికొంత మొలక దెబ్బతినడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఒడిశా రకం బొండాల విత్తనాల లభ్యత ఉన్నప్పటికీ ఇది తూర్పు డెల్టాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే లభ్యమవుతోంది.

కిలో విత్తనం రూ.100

ఎంటీయూ–3626తో పాటు ప్రైవేట్ రకాల బొండాలను ప్రభుత్వం విక్రయించదు. ప్రైవేట్ కంపెనీలతో పాటు రైతుల వద్ద నుంచి ఈ విత్తనాలను సేకరిస్తారు. ఖరీఫ్ భారీ వర్షాల వల్ల విత్తనాల చేలు దెబ్బతినడం వల్ల ఇప్పుడు ఈ కొరత ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకుని గతంలో 30 కేజీల విత్తనం రూ.వెయ్యి ధరను ఇప్పుడు ఏకంగా రూ.మూడు వేలు చేశారు. దీంతో కేజీ విత్తనం ధర రూ.100 వరకు ఉండడం గమనార్హం. హైబ్రీడ్ బొండాల విత్తనం ధర సైతం అధికంగానే ఉంది. ఈ రేటుకు కొందామన్నా అందుబాటులో విత్తనం లేకుండా పోయింది. వ్యవసాయ శాఖ అధికారులు డెల్టాలో ఎంటీయూ - 1121 రకాన్ని సాగు చేయాలని సూచిస్తున్నారు.

రబీలో బొండాలకు క్రేజ్

రబీలో బొండాల రకాలకు క్రేజ్ అధికం. కనీస మద్దతు ధర కన్నా అదనంగా బస్తాకు రూ.200 నుంచి రూ.400 వరకు అదనంగా ధర వచ్చిన సందర్భాలు సైతం ఉన్నాయి. గత ఏడాది బస్తా కనీస మద్దతు ధర రూ.1,637 కాగా, బొండాలకు ఒక సందర్భంలో రూ.1,900 వరకు ధర వచ్చింది. ఈ కారణంగా రైతులు ఈ రకానికి మొగ్గు చూపుతున్నారు. తొలి పంట సాగు చేయకపోవడం, చేసిన చోట సరైన దిగుబడి రాకపోవడం వల్ల పెద్దగా లాభాలు పొందని రైతులు బొండాల సాగు చేయాలని పట్టుదలతో ఉన్నారు. ఈ రకం విత్తనాల కొరత వల్ల వారు ఆందోళన చెందుతున్నారు. విత్తన కొరత రబీ ఆలస్యానికి కారణమవుతోంది.

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో 16 మందికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, 19 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో, కోరంగి పోలీసు స్టేషన్ పరిధిలో, గొల్లపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో, పెద్దపూడి పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా 16 మందికి ఒక్కొక్కరికి రెండు రోజులు జైలు శిక్ష, 19 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

4,000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

- వాహన తనిఖీల్లో పట్టుబడ్డ సారా
- నరుకు, ఆటో స్వాధీనం



ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, ఆటో

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 180 లీటర్ల సారా, ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాచపల్లి అడ్డరోడ్డు జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో సారా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ కేసులో దుంగా రాజును అదుపులోకి తీసుకుని, ఆటోతో పాటు 180 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి మండలం సోమవరం, కృష్ణవరం గ్రామాల్లో సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 4 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

కాకినాడ సిటీ: సంక్రాంతి పండగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. సంక్రాంతికి జనవరి 9, 10, 11, 12 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాలోని మూడు డిపోల పరిధిలో బస్టాండ్లకు రోజుకు 20 ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు. ప్రత్యేక సర్వీసులో వచ్చి వెళ్లడానికి ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేయించుకున్న వారికి రేటులో పది శాతం రాయితీ ఇస్తామన్నారు. సాధారణ ధరలకే ప్రత్యేక సర్వీసులు అందిస్తున్నట్టు తెలిపారు. ఆర్టీసీలోని కార్గో డోర్ డెలివరీ సర్వీసును ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కందకిదే మంచి తరుణం

- సాగు యాజమాన్యంతో అధిక దిగుబడి
- నేల తయారీ మొదలు తెగుళ్ల నివారణ వరకూ అప్రమత్తంగా ఉండాలి
- కొవ్వూరు ఉద్యావనశాఖాధికారి శ్రీనివాస్





అన్నవరప్పాడులో విత్తనం కందను చేలో పరిచిన దృశ్యం



పాడి-పంట

అన్నవరప్పాడులో విత్తనం కందను నాటుతున్న కూలీలు

పెరవలి: రాష్ట్రంలో ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో 10వేల హెక్టార్లలో కంద సాగుచేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, నల్లజర్ల, ఉండ్రాజవరం, చాగల్లు మండలాల్లో సుమారు 400 హెక్టార్లలో సాగుచేస్తున్నారు. ఈ సాగుకు ఇదే సరైన సమయం కావడంతో కంద నాటే విధానం, సాగు, సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కొవ్వూరు ఉద్యావన శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాస్ వివరించారు.

- **నేలతయారీ**

నీటి వసతి కలిగి నీరు బయటకుపోయే సదుపాయం ఉన్న సారవంతమైన నేలలను ఎన్నుకోవాలి. దుక్కి లోతుగా దున్నాలి. ఆఖరి దుక్కిలో 10 టన్నుల చివికిన పశువుల ఎరువును, 24 కిలోల భాస్వరం ఎరువులను వేసి దున్నాలి.

- **నాటేసమయం**

ఏడాదిలో రెండుసార్లు ఈ పంటను వేయవచ్చు. మే, జూన్ నెలల్లో, నవంబర్, డిసెంబర్ నెలల్లో విత్తనాన్ని నాటవచ్చు.

- **విత్తనం**

నీడలో రెండు మూడు నెలలు ఆరబెట్టిన దుంపలనే విత్తనంగా ఉపయోగించాలి. విత్తన దుంపలు 500 గ్రాముల నుంచి 750 గ్రాముల బరువు కలిగిన దుంపలను వినియోగిస్తే వీటిని ముక్కలుగా కోసి వాడవచ్చు. ముక్కలుగా కోసేటప్పుడు దుంప కన్ను (మొలకభాగం) ప్రతి ముక్కలోకి వచ్చే విధంగా కోయాలి. విత్తన దుంపలను కోసిన తరువాత వెంటనే నాటాలి. ఎకరానికి ఆరు టన్నుల విత్తనం వాడాలి.

- **నాటడం**

విత్తన దుంపలను 60 ఇంటు 60 సెంటీ మీటర్ల దూరంలో నాటాలి. దుంపలను భూమికి లోతుగా నాటి వెంటనే తడిపెట్టాలి.

- **ఎరువుల యాజమాన్యం**

విత్తనం నాటిన 40, 80, 120 రోజులకు ఎరువులను వేయాలి. నత్రజని, పొటాష్, యూరియా 217కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 179 కిలోలను 3 సమాన భాగాలుగా చేసి పైన తెలిపిన రోజుల్లో అందించాలి.

తెగుళ్లు

- **ఆకుమచ్చ తెగులు**

ఆకులపై చిన్నచిన్న మచ్చలు ఏర్పడి అవి పెరిగి ఆకు అంతా వ్యాపించి ఎండిపోతాయి. ఈ తెగులు సోకడం వలన పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును పిచికారీ చేస్తే నివారణ అవుతుంది.

- **కాండం లేక మొదలు కుళ్లు తెగులు:**

ఈ తెగులు మొక్క మొదలు వద్ద కాండాన్ని ఆశించడంతో కాండం కుళ్లి చనిపోతుంది. ఈ తెగులు ఆశించినప్పుడు మొదలుకు నీరు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దీని నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును కలిపి కాండం మొత్తం తడిసేలా పిచికారీ చేస్తే నివారించవచ్చు.

- **మొజాయిక్ తెగులు:**

ఇది వైరస్ తెగులు. ఈ తెగులు ఆశించిన మొక్కల ఆకులు పత్రహరితాన్ని కోల్పోయి ఆకులపై తెలుపు, పసుపురంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగాను, ముడుచుకుపోయినట్లుగా ఉంటాయి. ఈ తెగులు విత్తన దుంపల ద్వారా, పేనుబంక పురుగు ద్వారాను వ్యాపిస్తుంది. దీని నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ మందును 2 మిల్లీలీటర్లు 1 లీటరు నీటిలో కలిపి ఆకులు పూర్తిగా తడిసేలా పిచికారీ చేస్తే నివారించవచ్చు.

ధాతు లోపాలు

- **ఇనుపధాతు లోపం**

కంద పంటకు నీటితడులు సక్రమంగా ఇవ్వని చేలల్లో ఇనుపధాతువు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ ధాతు లోపం ఉన్న మొక్కల ఆకులు పత్రహరితాన్ని కోల్పోయి తెల్లగా మారతాయి. దీని నివారణకు లీటరు నీటికి 5 గ్రాముల అన్నబేధి, గ్రాము నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

- **జింక్‌ధాతు లోపం**

జింక్ ధాతు లోపం ఉన్న కందమొక్కల ఆకుల ఈనెల మధ్య పసుపు వర్ణంగా మారి ఆకు ముగ్గిపోయి ఎండిపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే నివారణ అవుతుంది.

జేఎన్‌టీయూకేలో వర్క్‌షాపు



ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ప్రమాణాలు వివరిస్తున్న విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్(ఎన్ఐఆర్ఎఫ్)అనేది విద్యా సంస్థల ప్రమాణాలకు ర్యాంకింగ్ లాంటిదని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్లకు 'ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ 2025లో మెరుగైన పనితీరు, వ్యూహాత్మక విధానం' అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్ అనేది లీడర్‌షిప్ ప్రొఫెషన్‌కు పరీక్ష లాంటిదని, విద్యాసంస్థ నాణ్యత ప్రమాణాలను ప్రతిబింబిస్తుందన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న తరుణంలో అధ్యాపకులకు, విద్యార్థులకు అంతరం ఏర్పడుతుందని, దీనిని అధిగమిస్తే అధ్యాపకులు సాంకేతిక మార్పులను అర్థం చేసుకోవాలన్నారు. రానున్న ఐదేళ్లకాలంలో మన రాష్ట్రంలో 15 నుంచి 20 వరకూ విదేశీ వర్సిటీలు ఏర్పాటుకానున్నాయని, అలాగే 20 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ కృష్ణప్రసాద్, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.మధు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	11,000 – 11,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రానున్నది డ్రోన్ యుగం



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు, ప్రొఫెసర్లు

- ఈ సాంకేతికత ఉపయోగం పెరిగింది
- ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రస్తుత సాంకేతిక యుగంలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగం పెరిగిందని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ రామ్మోహనరావు మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ ప్రతిచోటా వాడుతున్నారని, అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే వీటి వినియోగంలో ముందంజలో ఉన్నాయన్నారు. మానవ జీవనం, రక్షణ రంగం, ఆరోగ్య సంరక్షణ, విపత్తులు, గృహ వినియోగ కార్యకలాపాలు, పరిశ్రమలలో డ్రోన్ టెక్నాలజీకు భారీ డిమాండ్ ఏర్పడిందన్నారు. వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అధికంగా గల ఈ ప్రాంతంలో డ్రోన్ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఏర్పడుతాయని, చాలా ఇంజినీరింగ్ కళాశాలలు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ ప్రయోగశాలలు ఏర్పాటు చేశాయన్నారు. ఈ ప్రయోగశాలల ద్వారా అనేక అప్లికేషన్లు రూపొందించడం జరుగుతుందని, వినూత్న ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే డ్రోన్లను రూపొందించేందుకు ముందుకు రావాలని విద్యార్థులకు సూచించారు. ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాపు ద్వారా విద్యార్థులకు డ్రోన్ ఫ్లైట్, అసెంబ్లింగ్, ఫ్లయింగ్ టెక్నిక్స్, డ్రోన్ కాన్ఫిగరేషన్ తదితర అంశాలపై పూర్తి అవగాహన ఏర్పడుతుందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు డ్రోన్ విద్యార్థులుగా మారాలని, ప్రతి అధ్యాపకుడు డ్రోన్ ఆచార్యుడు కావాలన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ట్రాఫిక్ స్తంభించినపుడు డ్రోన్‌లను వినియోగించడం ద్వారా వాటి సూచనల మేరకూ ట్రాఫిక్ మళ్లించవచ్చన్నారు. విపత్తుల సమయంలో డ్రోన్ టెక్నాలజీ సమర్థవంతంగా వినియోగించుకంటే ప్రాణనష్టాన్ని నివారించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన డ్రోన్ టెక్నాలజీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ప్రొఫెసర్లు సుబ్బారావు, మీరాసాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రత్నగిరిపై కట్న కానుకల పునరుద్ధరణ

ఈఓ సుబ్బారావు ఆదేశం

సాక్షి ఇంపాక్ట్



ఆదివారం సాక్షి దినపత్రికలో కట్న కానుకలకు మంగళం శీర్షికన ప్రచురితమైన కథనం

అన్నవరం: సత్యదేవుని నిత్య కల్యాణంలో కట్న కానుకలు, చదివింపులను పునరుద్ధరిస్తున్నట్టు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు సోమవారం తెలిపారు. సత్యదేవుని నిత్యకల్యాణంలో స్వామి, అమ్మవార్లకు గతంలో భక్తులు కట్న కానుకలు, పట్టు వస్త్రాలు సమర్పించే సంప్రదాయం ఉండేది. అయితే దీనిని మధ్యలో నిలిపివేస్తే 2023లో అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ పునరుద్ధరించారు. ఆయన ఇక్కడ నుంచి అదే ఏడాది నవంబర్‌లో బదిలీ అయ్యాక మరలా దీనిని నిలిపివేశారు. దీనిపై ఆదివారం సాక్షి దిన పత్రికలో కట్న కానుకలకు మంగళం శీర్షికన వార్త ప్రచురితమైంది. ఆ కథనానికి ఈఓ స్పందించారు. గతంలో ఏ విధంగా అయితే కల్యాణంలో భక్తులు కట్నకానుకలు సమర్పించే వారో అదే పద్ధతి తిరిగి పునరుద్ధరించాలని ఆదేశించారు. రూ.500 దాటిన కట్న కానుకలకు కంప్యూటర్ రశీదు ఇవ్వాలని, అంతకు తక్కువ మొత్తాలను హుండీలో వేయించాలని కూడా ఆదేశించారు. కట్న కానుకలు చదివించిన భక్తులను వేద పండితులు ఆశీర్వదించాలని ఆదేశించారు.

దీపక్‌రాజ్‌కు గరికపాటి కళాకౌముది



రచయిత దీపక్ రాజ్

సీటీఆర్ఐ: పుల్లెపు తాతయ్య మెమోరియల్ (పీటీఎం) సంస్థ ఆధ్వర్యంలో గరికపాటి రాజారావు కళా కౌముది అవార్డును ఈ ఏడాది రాజమహేంద్రవరానికి చెందిన రచయిత దీపక్‌రాజ్‌కు ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పుల్లెపు వేంకటేశ్వరరావు ఒక ప్రకటన లో తెలిపారు. 2025 జనవరి 5వ తేదీన ముమ్మిడివరం నియోజకవర్గం ఐ.పోలవరంలో జరిగే సంస్థ వార్షికోత్సవంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని తెలిపారు. దీపక్ రాజు పుట్టింది కోనసీమలో స్థిరపడింది రాజమండ్రిలో. చిన్నతనంలో రేడియో నాటికలతో ప్రారంభమైన ఆయన ప్రస్థానం తరువాత స్టేజిపై, పరిషత్ నాటికలలో నటిస్తూనే టీవీ సీరియల్స్‌లో, సినిమాలలో కూడా నటించారు. కూచిపూడి నృత్య కళాకారుడైన దీపక్‌రాజ్‌కు సాహిత్యం మీద ఉన్న అభిలాష ఆయనను రచయితగా మార్చింది. సెంట్రల్ బ్యాంక్‌లో బ్రాంచ్ మేనేజరుగా తన వృత్తి రీత్యా ఎన్నో ఊళ్లలో పనిచేశారు. ప్రవృత్తి రీత్యా వార పత్రికలకు, మాసపత్రికలకు కథలు రాయడం మొదలుపెట్టి, దాదాపు 68 కథలు, 2 సీరియల్స్ రాశారు. ముఖ్యంగా తాను పుట్టి పెరిగిన కోనసీమ చరిత్రను మన కోనసీమ కథలు పేరిట రాశారు.

లీల మృతిపై వన్యప్రాణి సంరక్షణ బోర్డుకు ఫిర్యాదు



అడ్వకేట్ సురేష్

సీతానగరం: మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామనగరంలోని చిట్టిబాబాజీ సంస్థానానికి చెందిన లీల (ఏనుగు) మృతిపై ఎనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసినట్టు చినకొండేపూడికి చెందిన అడ్వకేట్ చిడిపి నకుల సురేష్ సోమవారం తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ఏనుగు మృతికి కారణం పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఏనుగు ఉండే ప్రదేశంలో కాంక్రీట్ ఫ్లోరింగ్ ఉండరాదని, మట్టి, ఇసుక మాత్రమే ఉండాలని, అదే విధంగా నిర్దిష్టమైన కొలతల్లో ఈత కొలను ఏర్పాటు చేయాలన్నారు. కాంక్రీట్ ఫ్లోరింగ్ వల్ల దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయన్నారు. ఏనుగును అనువైన ప్రదేశంలో ఉంచాలన్నారు. వీధులలో తిప్పడం వల్ల భక్తులు రకరకాల ఆహారం పెట్టేవారని, దీనితో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అలాగే దీనిపై విష ప్రయోగం జరిగి ఉండవచ్చన్నారు. దీనిపై న్యూఢిల్లీలోని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు రిజిస్టర్ చేశామన్నారు. అలాగే అటవీ, పోలీస్, రెవెన్యూశాఖలకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్టు అడ్వకేట్ నకుల సురేష్ తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మలికిపురం: మలికిపురం మండలం గూడపల్లి పంట కాలువలో పడి కేశనపల్లి గ్రామానికి చెందిన కొప్పాడి ఏడు కొండలు (47) మృతి చెందినట్టు ఎస్సై పీవీవీ సురేష్ సోమవారం తెలిపారు. రెండు రోజులుగా అతని కోసం గాలిస్తున్న బంధువులకు అతడు పంట కాలువలో శవమై కనిపించడంతో పోలీసులు విచారణ చేపట్టారు. కాల కృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందినట్లు గుర్తించామని ఎస్సై వివరించారు. మృత దేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మలికిపురం: మండలంలోని గుబ్బలపాలెంకి చెందిన పెచ్చెట్టి ధనలక్ష్మి (69) కట్టెల పొయ్యి వద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుని గాయపడింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మలికిపురం ఎస్సై పీవీవీ సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంగళూరులో ఇద్దరి సైబర్ మోసగాళ్ల అరెస్టు

బనశంకరి (బెంగళూరు): విశాఖపట్నం, గోదావరి జిల్లాల నుంచి పెద్దమొత్తంలో సిమ్ కార్డులను సేకరించి సైబర్ మోసగాళ్లకు సరఫరా చేస్తున్న వ్యక్తులను కర్ణాటకలో మంగళూరు నగర సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాకు చెందిన కణాతల వాసుదేవరెడ్డి (25), ఏపీలో గోదావరి జిల్లాలకు చెందిన వీర వెంకట సత్యనారాయణరాజు అనే ఇద్దరు ఈ కేసులో పట్టుబడ్డారు. వీరు సైబర్ నేరగాళ్లతో మిలాఖత్ అయ్యారు. భారత్‌కు చెందిన పలు టెలికాం కంపెనీల సిమ్ కార్డులను దుబాయ్‌లోని సైబర్ ముఠాలకు సరఫరా చేసేవారు. ఇద్దరూ 500 కు పైగా సిమ్‌కార్డులను పంపారు.

ఇలా గుట్టు రట్టయింది : వీర వెంకటసత్య నారాయణరాజు పలువురికి మోసపూరిత వాట్సాప్ లింక్‌లు పంపి రూ.10.84 లక్షలను దోచుకున్నాడు. మోసపోయిన వారిలో ఒకరైన మంగళూరు వాసి ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఇటీవల రాజును పోలీసులు పట్టుకొని విచారించగా, సిమ్‌కార్డుల దందా బయట పడింది. రెండు రోజుల కిందట వాసుదేవరెడ్డి ఢిల్లీ విమానాశ్రయంలో ఉండగా అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు. విశాఖపట్టణం, గోదావరి జిల్లాల నుంచి సిమ్ కార్డులను సేకరించి విదేశాలకు పంపించినట్లు తేలింది. రాజు నుంచి 300 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాజు దుబాయ్‌లోని విన్సెక్స్ అనే కంపెనీకి సిమ్‌లను పంపించాడు. అక్కడ మోసగాళ్లు కాల్‌సెంటర్ తెరిచి అమాయకులకు ఫోన్లు చేసేవారు. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి అని ఆర్థిక మోసాలకు పాల్పడేవారని కమిషనర్ తెలిపారు. కాల్స్‌కు, బ్యాంకు ఖాతాలకు ఈ సిమ్‌లను వాడేవారు. మరో వ్యక్తి శివ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికలు

ప్రకాశం నగర్: రాజస్థాన్‌లోని జైపూర్‌లో జనవరి 7 నుంచి 13 వరకు నిర్వహించే సీనియర్ జాతీయ వాలీబాల్ పోటీలకు రాష్ట్రం నుంచి పురుషులు, మహిళల జట్లకు ఈ నెల 27న ఎంపికలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ ఎంపికలు జరుగుతాయని, క్రీడాకారులు నేరుగా పాల్గొనవచ్చని ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం ఏడు గంటలకు ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వద్ద ఉన్న వాలీబాల్ కోర్టుకు హాజరుకావాలని తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



బాలుర విభాగంలో లీగ్ మ్యాచ్ ఆడుతున్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల జట్లు



బాలికల విభాగంలో లీగ్ మ్యాచ్ ఆడుతున్న పశ్చిమ గోదావరి, చిత్తూరు జిల్లాల జట్లు

లీగ్ దశలో ఆడుతున్న బాలురు, బాలికల జట్లు

రావులపాలెం: కబడ్డీ అసోసియేషన్, సీఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి కబడ్డీ బాయ్స్ అండ్ గర్ల్స్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం హోరా హోరీగా జరుగుతున్నాయి. సీఆర్‌సీ ఎదురుగా ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసిన రెండు కోర్టులలో ఒక దానిలో బాలుర, రెండో దానిలో బాలికల మ్యాచ్‌లు జరుగుతున్నాయి. 13 జిల్లాల నుంచి బాలుర, బాలికల విభాగాల్లో మొత్తం 26 జట్లు రాగా, తొలి రెండు రోజులు లీగ్ దశలో ఒక విభాగంలో 15 మ్యాచ్‌లు నిర్వహించారు. లీగ్ దశలో ప్రతి జిల్లా జట్టు రెండు మ్యాచ్‌లు ఆడగా పాయింట్లను పరిగణలోకి తీసుకుంటారు. వీటి నుంచి రెండో విభాగాల్లో ఎనిమిది చొప్పున జట్లను నాకౌట్ దశకు ఎంపిక చేయనున్నారు. పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరు వెంకటరెడ్డి, సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, సీఆర్‌సీ సెక్రటరీ కర్రి అశోక్ రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, డైరెక్టర్లు చిర్ల కనికిరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ఉమ్మడి రాష్ట్రాల్లో అత్యున్నత విద్యాసంస్థ తిరుమల

ఇన్‌స్పైర్–2024లో కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు



విద్యార్థులతో కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు, విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, బి.వెంకటరమణచౌదరి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: దేశం గర్వించ దగ్గ ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్, ఎన్ఐటీ తదితర ఇనిస్టిట్యూషన్లలో తిరుమల విద్యా సంస్థలకు చెందిన 627 మంది విద్యార్థులు ప్రవేశాలు సాధించడం గొప్ప విషయమని కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్నాయుడు అన్నారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో అత్యున్నతమైన విద్యాసంస్థగా ఈ విద్యాసంస్థ నిలిచిందన్నారు. సోమవారం స్థానిక విద్యాసంస్థ ఆవరణలో ఐఐటి, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీ, బిట్స్‌లలో ప్రవేశాలు సాధించిన విద్యార్థులను అభినందించేందుకు ×ఇన్‌స్పైర్–2024₹ నిర్వహించారు. తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధిలో తిరుమల బృందం పనితీరును ఆయన అభినందించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి తదితరులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యాసంస్థలు చైర్మన్ తిరుమలరావు మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 627 మంది విద్యార్థులను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా సత్కరించినట్టు తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, డైరెక్టర్లు సరోజినీదేవి, సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.